# సాక్షి
## కుమురం భీం

సోమవారం ; 14 ; ఏప్రిల్ ; 2025






**సేంద్రియ సాగు.. భేష్**

యువరైతు గోనె సతీశ్ సేంద్రియ ఎరువులతో 18 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాడు. ఇంటి వద్దే ఘన జీవామృతం, వర్మికంపోస్టు తయారు చేస్తున్నాడు. 8లో▸



**మండుతున్న ఎండలు..!**

జిల్లాలో నాలుగు రోజులుగా ఎండలు దంచి కొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నాయి. ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
39.5 /26.6

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.



మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి దంపతులు



అమ్మవారికి సమర్పించేందుకు బోనాలతో తరలివచ్చిన భక్తులు



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు



పల్లకి మోస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్, అర్చకుడు

## జాతరకు పోటెత్తిన భక్తులు

రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని స్వయంభూ మహంకాళి, కనక దుర్గాదేవి ఆలయంలో చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు సమీప జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య అమ్మవారికి బోనాలు, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి వంటలు చేసి వనభోజనాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ప్రత్యేక పల్లకిలో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుటుంబ సభ్యులతో పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ ఎమ్మెల్యే దంపతులను సన్మానించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు గర్భాలయంలోని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఏఎస్పీ చిత్తరంజన్, రెబ్బెన ఎస్సై డి.చంద్రశేఖర్, వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా వెలిసిన దుకాణాల్లో మహిళలు సామగ్రి కొనుగోలు చేస్తూ సందడి చేశారు. – రెబ్బెన

## న్యూస్‌రీల్

### కలెక్టరేట్‌ను సందర్శించిన జాతీయ ఓబీసీ చైర్మన్



కలెక్టరేట్‌లో జాతీయ ఓబీసీ చైర్మన్ హంసరాజ్ అహిర్‌తో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ఆసిఫాబాద్:** జాతీయ ఓబీసీ చైర్మన్ హంసరాజ్ అహిర్ ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం తేనీటి విందులో పాల్గొన్నారు.

### నేడు కలెక్టరేట్‌లో అంబేడ్కర్ జయంతి

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు.

### జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ అరుణశ్రీ

**ఆసిఫాబాద్‌రూరల్:** జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని అక్షర జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అరుణశ్రీ తెలిపారు. జిల్లాకేంద్రంలోని కళాశాలో కోచ్ రవికుమార్‌తో కలిసి ఆదివారం విద్యార్థిని అభినందించారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్‌– 19 ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిందన్నారు. ఈ నెల 14 నుంచి 21 వరకు మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో అక్షర పాల్గొంటుందని తెలిపారు. అలాగే మార్చి 14న జరిగిన అండర్‌– 14 ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన భూమికను అభినందించారు.

### ఐక్య ఉద్యమాలకు చిరునామా టీఎస్‌యూటీఎఫ్



జెండా ఎగురవేస్తున్న నాయకులు

**కాగజ్‌నగర్‌రూరల్:** ఐక్య ఉద్యమాలకు చిరునామాగా టీఎస్ యూటీఎఫ్ నిలిచిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.శాంతికుమారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో టీఎస్ యూటీఎఫ్ పనిచేస్తుందన్నారు. హక్కులు, బాధ్యతలు ఉద్యమ నేత్రాలుగా, ప్రాంతాలు, యాజమాన్యాలు, క్యాడర్లు, మతాలు, కులాల అంతరాలను అధిగమించి ఉపాధ్యాయులందరికీ ఒకే సంఘం అనే చారిత్రక ఆవశ్యకతతో సంఘం ఆవిర్భవించిందని తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎం.రాజకమలాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రీతి, ఎస్‌ఎఫ్ఐ అధ్యక్షుడు వసాకె సాయికుమార్, నాయకులు బాజీఖాన్, శిరీష, సురేశ్, జహీర్, విజయ్, రాజశేఖర్, ప్రవళిక, రష్మిక, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నితో జాగ్రత్త..!



కాగజ్‌నగర్‌లోని ఫైర్ స్టేషన్

- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు
- వేసవిలో పొంచి ఉన్న ప్రమాదాలు
- ప్రమాదం జరిగితే డయల్ 101కు సమాచారం ఇవ్వాలి
- జిల్లాలో రెండు ఫైర్ స్టేషన్లు



కౌటాలలో అగ్నిప్రమాదంలో కాలిపోతున్న లేడీస్ ఎంపోరియం(ఫైల్)

**కౌటాల(సిర్పూర్):** వేసవి ప్రారంభమైంది. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నాయి. పొడి వాతావరణంతో ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే ఆస్తులు కాలి బూడిదవుతుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే వారోత్సవాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలి.. ఎలా రక్షించుకోవాలనే విషయాలను ప్రాక్టికల్‌గా డ్రిల్ చేసి వివరించనున్నారు.

**ప్రమాదాలతో తీవ్ర నష్టాలు**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏటా అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో మాత్రమే అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. రెండు నియోజకవర్గాల్లోని మారుమూల మండలాలు, గ్రామాల్లో మంటలు చెలరేగినప్పుడు ఫైరింజన్ సకాలంలో చేరడం లేదు. బాధితులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. సిర్పూర్ నియోజకవర్గంలోని మారుమూల మండలాలైన బెజ్జూర్, కౌటాల, చింతలమానెపల్లి, దహెగాంతోపాటు ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని సిర్పూర్(యూ), జైనూర్, లింగాపూర్, తిర్యాణి వంటి ఏజెన్సీ మండలాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే బాధితులు ఆశలు వదులుకోవాల్సిందే. ఫైర్‌స్టేషన్ల నుంచి ఆయా మండలాలు దాదాపు 50 నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ప్రమాద స్థలాలకు ఫైరింజన్లు చేరుకోవడానికి రెండు, మూడు గంటల సమయం పడుతుంది. నిబంధన ప్రకారం.. ప్రతీ 50 వేల జనాభాకు ఒక అగ్నిమాపక కేంద్రం ఉండాలి. ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో ఐదు లక్షల మందికి పైనే నివసిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో కనీసం పది అగ్నిమాపక కేంద్రాలు ఉండాలి. ప్రస్తుతం ఉన్న రెండు కేంద్రాల భవనాలు కూడా శిథిలాస్థలో ఉంది. సిబ్బంది కొరత సైతం వెంటాడుతోంది. కౌటాల, కెరమెరి ప్రాంతాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని శాఖ అధికారులకు గతంలోనే ప్రభుత్వానికి నివేదికలు అందించారు.

**సంప్రదించాల్సిన నంబర్లు**

| |
|---|
| కాగజ్‌నగర్ ఫైర్‌స్టేషన్ ఎస్సై భీమయ్య |
| 89194 20328 |
| ఆసిఫాబాద్ ఫైర్‌స్టేషన్ అధికారి |
| 87126 99190 |
| టోల్‌ఫ్రీ నంబర్ 101 |

**అప్రమత్తతే రక్షణ**

ఎండలు మండిపోతుండటంతో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అప్రమత్తతతోనే ప్రమాదాల సమయంలో ఆస్తులు, ప్రాణాలు రక్షించుకోగలం. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే డయల్ 101కు సమాచారం ఇవ్వాలి. ప్రజలకు అవగాహన కల్పించేందుకు వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– భీమయ్య, ఎస్సై, అగ్నిమాపక శాఖ, కాగజ్‌నగర్

**నేటి నుంచి వారోత్సవాలు**

ఏటా ఏప్రిల్ 14న జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవం నిర్వహిస్తారు. 1944 ఏప్రిల్ 14న ముంబయిలో విక్టోరియా డాక్ యార్డులో అగ్నిప్రమాదం సంభవించి 66 మంది అగ్నిమాపక సిబ్బంది, సుమారు 800 మంది ప్రజలు చనిపోయారు. వారి స్మారకార్థం జాతీయ అగ్నిమాపక దినోత్సవం నిర్వహిస్తున్నారు. వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు చేపడతారు. మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు కూడా ఏర్పాటు చేస్తారు.

- ఏప్రిల్ 14న అగ్నిమాపక కేంద్రాల్లో ఏర్పాటు చేసే కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం విధి నిర్వహణలో అసువులు బాసిన అగ్నిమాపక దళ సిబ్బందికి నివాళులర్పిస్తారు. ఆయా స్టేషన్లలో ఉండే అగ్నిమాపక నియంత్రణ పరికరాలు, వాహనాలు ప్రజలు సందర్శించేందుకు వీలుగా ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తారు.
- 15న రద్దీ ప్రాంతాలైన బస్టాండ్లు, రైల్వేస్టేషన్, పార్కులు, మార్కెట్ యార్డుల వద్ద అగ్ని ప్రమాదాల సంభవించే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలర్పే విధానం గురించి వివరిస్తారు.
- 16న ఆస్పత్రుల్లో అగ్నిమాపక పరికరాలు తనిఖీ చేసి, అక్కడ ప్రమాదాలు జరిగితే ఫైర్ డ్రిల్, ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్‌పై అవగాహన కల్పిస్తారు.
- 17న గృహాలు, అపార్ట్‌మెంట్లలో జరిగే ప్రమాదాల గురించి వివరిస్తారు. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల భద్రత, విద్యుత్ ఉపకరణాలతో జరిగే ప్రమాదాల గురించి తెలుసుకోవడం, ఆయా వస్తువుల మరమ్మతుకు గుర్తైతే గుర్తించే విధానం చెబుతారు.
- 18, 19వ తేదీల్లో పరిశ్రమలు, పెట్రోల్ బంక్‌లు, గోదాములు, వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు, ఫంక్షన్‌హాళ్లలో అగ్నిమాపక పరికరాల బిగింపు, తనిఖీలతోపాటు అక్కడ సంభవించే ప్రమాదాలు విద్యుత్, పెట్రోల్, డీజిల్, కిరోసిన్, గ్యాస్ లీకేజీలతో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తారు. మాక్ డ్రిల్, కార్బన్ డై ఆక్సైడ్, డ్రై కెమికల్ పౌడర్‌లను ఉపయోగించి మంటలర్పే విధానం గురించి తెలియజేస్తారు.
- 20న ఉన్నతాధికారులు, ఫైర్‌సేఫ్టీలో ఉండే భద్రతాపరమైన సలహాలు అందించేందుకు సదస్సులు నిర్వహించనున్నారు.

### రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

- ఏఎస్పీ చిత్తరంజన్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ

**వాంకిడి(ఆసిఫాబాద్):** రక్తదానం మరొకరికి ప్రాణదానం వంటిదని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆపదలో ఉన్నవారికి రక్తం దానం చేయడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. తద్వారా ఒకరి ప్రాణాలు నిలబెట్టిన వారవుతారని అన్నారు. సమాజ సేవలో బాధ్యతగా ఉంటూ వ్యక్తిగత ఎదుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. మహనీయుని జయంతి సందర్భంగా సామాజిక కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. రక్తదానం చేసిన యువకులను అభినందించారు. 22 యూనిట్ల రక్తం సేకరించి ఆసిఫాబాద్ రక్తనిధి కేంద్రానికి అప్పగించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, రక్తనిధి కేంద్రం వైద్యుడు అమ్జద్, బౌద్ధ సంఘం, బీఎస్ఐ, సిద్దార్థ యువజన సంఘం, సమతా సైనిక్ దళ్, రమాబాయి మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

**కౌటాల(సిర్పూర్):** కాంగ్రెస్ పార్టీతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కౌటాల మండలం మొగడ్దగడ్ గ్రామంలో ఆదివారం రాత్రి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కించపరుస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ పాలనలో దేశంలో అభివృద్ధి జరగడం లేదని ఆరోపించారు. అంతకుముందు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఖాళీం, భూషన్, ఉద్దవ్, కార్తీక్, సుదర్శన్, సంతోష్, వినోద్, సోను, జోగు, భాస్కర్, పోశం తదితరులు పాల్గొన్నారు.

# ‘హైబ్రీడ్’ వైపు అడుగులు



రెబ్బెన మండలం నంబాల శివారులో హైబ్రీడ్ వరిలో పూత దులుపుతున్న కూలీలు

- జిల్లాలో పెరిగిన విత్తన వరి సాగు
- పంట వేసే ముందే రైతులతో కంపెనీల అగ్రిమెంట్
- క్వింటాల్‌కు రూ.7500 నుంచి రూ.14000 చెల్లింపు

**రెబ్బెన(ఆసిఫాబాద్):** జిల్లా రైతులు యాసంగి సీజన్‌లో హైబ్రీడ్ వరిసాగు వైపు దృష్టి సారిస్తున్నారు. పదేళ్లుగా కొందరు రైతులు ఈ రకం వరిసాగుతో లాభాలు సాధిస్తుండగా.. ఈసారి మరికొంత మంది ఆ దిశగా అడుగులు వేశారు. స్థానికంగా నేలలు, వాతావరణం అనుకూలంగా ఉండటంతో విత్తనోత్పత్తి కంపెనీల ప్రతినిధులు జిల్లాకు క్యూ కడుతున్నారు. గతంలో జిల్లాలోని రైతులు యాసంగిలో సాధారణ వరి సాగు చేసేవారు. ప్రధానంగా ఆసిఫాబాద్, రెబ్బెన, సిర్పూర్, దహెగాం, బెజ్జూర్, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి మండలాల్లో మాత్రమే వరి సాగు ఉంది. మిగిలిన మండలాల్లో ఎక్కువ మొక్కజొన్న, జొన్న పండిస్తారు. పదేళ్ల క్రితం దహెగాం మండలంలో రైతులు విత్తన వరిసాగు ప్రారంభించారు. ఆ తర్వాత పెంచికల్‌పేట్‌కు ఈ ఏడాది రెబ్బెన మండలానికి సైతం విస్తరించింది. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో జిల్లాలో సుమారు 2,500 ఎకరాలకు వివిధ రకాల కంపెనీలకు చెందిన హైబ్రీడ్ వరిని రైతులు సాగు చేస్తున్నారు. దహెగాంలో అత్యధికంగా సుమారు 1,800 ఎకరాల వరకు సాగు చేస్తున్నట్లు అంచనా.

**సన్నరకం కంపెనీలకు..**

హైబ్రీడ్ వరిసాగులో ఎలాంటి అనుభవం లేని రైతులు సైతం మంచి దిగుబడులు సాధించేలా కంపెనీ ప్రతినిధులు అన్ని తామై వ్యవహరిస్తున్నారు. సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు వివరిస్తున్నారు. పంటను విత్తన కంపెనీలే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సాగవుతున్న హైబ్రీడ్ ఆడ వరి ధాన్యానికి రూ.7,500 నుంచి రూ.14వేల వరకు చెల్లిస్తున్నారు. పూత దులిపే పనులు జోరుగా సాగుతున్నాయి. మరో నెల రోజుల్లో పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మిగిలిన మగరకం ధాన్యాన్ని(దొడ్డు రకం) రైతులు మార్కెట్‌లో విక్రయించుకోవాలి. దీని ద్వారా వారికి అదనపు ఆదాయం వస్తుంది.

**కష్టానికి తగినట్లు ఫలితం**

సాధారణ రకంతో పోల్చితే హైబ్రీడ్ వరి సాగులో కష్టం అధికంగా ఉంటుంది. నారు పోసిన నాటి నుంచి పంట కోత వరకు శ్రమించాల్సిందే. నారు పోసే పద్ధతి నుంచి నాట్లు వేయడం, యాజమాన్య పద్ధతుల్లో ఎంతో తేడా ఉంటుంది. మామూలుగా నారుమడిలో విత్తనాలన్నీ ఒకేచోట చల్లుతారు. కానీ హైబ్రీడ్‌సాగులో మాత్రం నారు మడిలో ఆడ, మగ విత్తనాలు వేర్వేరుగా చల్లాల్సి ఉంటుంది. నాటు సైతం మగ వరి రెండు వరుసల్లో నాటితే ఆడ వరి 8 నుంచి 10 వరకు ప్రత్యేకంగా నాటుకోవాలి. ఇక పొలంలో కలుపు నియంత్రణ, పురుగు మందుల పిచికారీ పనులు సైతం ఎక్కువగా ఉంటాయి. కూలీలపై ఆధారపడాల్సి వస్తుంది. ఆడ, మగ వరి సంకరీరణ చేసి విత్తనాలు పండిస్తారు. ఈ రకం సాగులో మగ మొక్క పుప్పొడి రేణువులు ఆడ మొక్కపై పడేటట్లు చేసే ప్రక్రియ ఎంతో కీలకం. పూత వచ్చే సమయంలో ఈ పుప్పొడి రేణువులను తాడు/కర్రల సహాయంతో దులుపుతారు. ఈ పనులను 12 నుంచి 15 రోజుల వరకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపే చేపట్టాలి. అప్పుడే సంపర్కం జరిగి ఆడ వరి దిగుబడి వస్తుంది. పెట్టుబడి, కష్టం అధికంగా ఉన్నా.. ఆదాయం ఆశించిన స్థాయిలో ఉండటంతో రైతులు ఈ రకం వరిసాగుకు మొగ్గు చూపుతున్నారు.

**ఎనిమిదేళ్లుగా సాగు**



గతంలో సాధారణ రకం వరి సాగు చేసే వాళ్లం. ఆడ, మగ వరి సాగులో లాభాలు ఉంటాయని తెలుసుకుని ఎనిమిదేళ్ల క్రితం ఈ సాగు ప్రారంభించాం. మొదటి ఏడాదే లాభాలు వచ్చాయి. ఈ సీజన్‌లో 15 ఎకరాల్లో సీడ్ పండిస్తున్నా. ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అనుకుంటున్నా. – కొండు సంతోష్

**అగ్రిమెంట్ చేసుకోవాలి**



హైబ్రీడ్ వరిసాగులో లాభాలు ఉంటాయి. అయితే సాధారణ సాగుతో పోల్చితే రిస్క్, పని రెండూ ఎక్కువే. హైబ్రీడ్ ఆడ వరి ధాన్యాన్ని విత్తనం ఇచ్చిన కంపెనీనే కొనుగోలు చేస్తుంది. రైతులు ముందుగా కంపెనీతో అగ్రిమెంట్ తప్పనిసరిగా చేసుకోవాలి.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

# వలసవాదులతో ఆదివాసీలకు అన్యాయం



కుమురంభీం సమాధిపై పూలు చల్లుతున్న నేతలు

- హెచ్‌సీయూ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు
- రెండోరోజూ తుడుందెబ్బ మహాసభలు

**కెరమెరి(ఆసిఫాబాద్):** 1976 తర్వాత వచ్చిన వలసవాదులతో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీఎస్‌డబ్ల్యూ శ్రీనివాస్‌రావు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు అన్నారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఆదివారం తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలు రెండోరోజూ కొనసాగాయి. కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం సమాధిపై పూలు చల్లి పూజలు చేశారు. మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ వలసవాదులతో స్థానిక ఆదివాసీలు పౌరహక్కులతోపాటు రిజర్వేషన్లలో దోపిడీకి గురవుతున్నారన్నారు. లంబాడాలను కేవలం విద్యాభివృద్ధి కోసం ఎస్టీలుగా పరిగణించారని, దీనిని సాకుగా చూపి కాలపరిమితి ముగిసినా వారికి విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు కొనసాగుతున్నాయని అన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు రిజర్వేషన్లు అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలనే ఆదివాసీల డిమాండ్ న్యాయపరమైందని స్పష్టం చేశారు.

**విచ్ఛిన్నానికి కుట్ర..**

హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భుజంగ్‌రావు మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీ ఉద్యమకారులను స్వప్రయోజనాల కోసం విభజిస్తున్నాయని ఆరోపించారు. హక్కులు, చట్టాలను కాలరాస్తూ ఓటుబ్యాంకుగా మార్చుకున్నాయన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య, కోకన్వీనర్ లక్ష్మీనారాయణ, కోట్నాక విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, నాయకులు నగేశ్, రఘుపతిరావు, రవి, బాపు, నరసింహరావు, కిశోర్, నారాయణ, ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, విద్యార్థి, మహిళా, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

**ఆసిఫాబాద్:** రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ రూపొందించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించేలా చొరవ చూపాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం నాయకులు జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ అహిర్‌ను కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోట కల్పించాలని విన్నవించారు. దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్, డివిజన్ అధ్యక్షుడు బొట్టుపెల్లి ప్రశాంత్, రైతు సంఘం నాయకులు మారుతిపటేల్, మాలి సంఘం గౌరవ అధ్యక్షుడు నాగోశ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సరస్వతి కెనాల్‌లో మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ శివారు గల సరస్వతి కెనాల్‌లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గమనించిన స్థానికులు అందించిన సమాచారం మేరకు ఎస్సై మాలిక్ రెహమాన్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. సరస్వతి కాలువ నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఎత్తు 5 ఫీట్లు, మృతుడిపై ఆరెంజ్ కలర్ టీషర్ట్, బ్లాకలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే ఎస్సై నంబర్ 8712659521, సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి 8712659519 నంబర్లలో సమాచారం అందించాలని సూచించారు.

### మెడికల్ కాలేజీకి భౌతికకాయం



లక్ష్మీనారాయణ(ఫైల్)

దండేపల్లి:మండలంలోని రెబ్బనపల్లికి చెందిన ముత్యం లక్ష్మీనారాయణ(65) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని భౌతికకాయాన్ని మంచిర్యాల మెడికల్ కాలేజీకి అప్పగించారు. రెండేళ్ల క్రితమే లక్ష్మీనారాయణ మరణానంతరం భౌతిక కాయాన్ని మెడికల్ కాలేజీకి అందిస్తానని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రం ఇచ్చారు. ఆదివారం ఆయన మరణించడంతో ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు భౌతిక కాయాన్ని మెడికల్ కాలేజీకి అందించారు.

### లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

దహెగాం: బెజ్జూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కందూరి రాజు తెలిపారు. మండలంలోని ఓ గ్రామంలో మే నత్త ఇంటికి ఈనెల 7న బాలిక రాగా అదే రోజు వరుసకు మామ అయిన బండి రవీందర్ లైంగిక దా డికి పాల్పడిన విషయం తెలిసిందే. బాలిక తండ్రి ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో దర్యాప్తు అనంతరం నిందితుడిని ఆదివా రం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

### సింగరేణి కార్మికుడి ఇంట్లో చోరీ

మందమర్రిరూరల్: పట్టణంలోని మొదటి జోన్‌లోని సింగరేణి కార్మికుడు ఇంట్లో చోరీ జరిగింది. అరుణ్‌కుమార్ పది రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలసి ఊరికి వెళ్లి ఆదివారం సాయంత్రం తిరిగివచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. అందులో తులం బంగారు ఆభరణాలు కనిపించలేదు. దొంగలు ఇంట్లో కారంపొడి చల్లారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రాజశేఖర్ అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ:18k Ph: 9640400073, 9160900024 [SCA25002716]
www.sakshi.com
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

# సేంద్రియ సాగు.. భేష్!

- స్వయంగా గోశాల ఏర్పాటు
- సేంద్రియ ఎరువులతో కూరగాయల సాగు
- పలు అవార్డులు, పురస్కారాలు అందుకున్న యువరైతు సతీశ్



గోశాలలో ఆవులు



ఘన జీవామృతం తయారు చేస్తున్న సతీశ్



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయిడు చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న సతీశ్

చెన్నూర్‌రూరల్: రసాయనిక ఎరువులకు స్వస్తిచెప్పి సహజ సిద్ధమైన ఎరువులను తయారుచేస్తున్నాడు మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని శివలింగాపూర్‌కు చెందిన యువరైతు గోనె సతీశ్. ఇంటి వద్దే ఘన జీవామృతం, వర్మికంపోస్టు తయారు చేస్తున్నాడు. ఇందుకు ఆవుపేడ, ఆవు మూత్రం వాడుతున్నాడు. తనకున్న 20 గుంటల భూమిలో సేంద్రియ ఎరువులతో 18 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నాడు.

**గోశాల ఏర్పాటు...**

మూడేళ్ల క్రితం ఇంటివద్ద షెడ్డు నిర్మించి ఒక్క ఆవుతో గోశాల ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం గోశాలలో 120కి పైగా ఆవులు ఉన్నాయి. ఆవుల పేడతో ఘన జీవామృతం, వర్మికంపోస్టు తయారు చేసి పంటలకు ఉపయోగిస్తున్నాడు. అంతేకాకుండా సేంద్రియ ఎరువుల వాడకంపై ఇతర రైతులకు అవగాహన కల్పిస్తున్నాడు. వారికి అతితక్కువ ధరకు ఎరువులు అందజేస్తున్నాడు. అంతేకాకుండా ఆవు పేడతో పిడకలు తయారుచేసి హోమాలకు, యజ్ఞాలకు అందజేస్తున్నాడు.

**కూరగాయల సాగు...**

ఇంటి వద్ద 20 గుంటల భూమిలో బీర, పూదీన, గ్రామ సమీపంలో ఐదెకరాల చేను కౌలుకు తీసుకుని మూడు రకాల వంకాయలు, సోరకాయలు సాగు చేస్తున్నాడు. వంకాయలు రోజుకు ఏడు నుండి ఎనిమిది క్వింటాళ్ల వరకు, సోరకాయలు, బీరకాయలు కలిపి రోజుకు రెండు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నాయి. వాటిని హోల్‌సేల్‌గా విక్రయించి ఆదాయం పొందుతున్నాడు. భార్య రజిత, తమ్ముడు భాస్కర్ సహకారం అందిస్తున్నారు.

**పలు అవార్డులు, ప్రశంసా పత్రాలు**

సేంద్రియ ఎరువులతో కూరగాయలు సాగు చేస్తున్న సతీశ్‌ను పలు సంస్థలు ఉత్తమ రైతుగా ఎంపిక చేసి పలు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశాయి. 2021లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో అప్పటి కలెక్టర్ భారతి హోలీకేరి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నాడు. 2022లో సుస్థిర వ్యవసాయ రాష్ట్రస్థాయి రైతు చైతన్య సదస్సులో హైదరాబాద్‌లో పుడమి పుత్ర అవార్డు, నేషనల్ ప్రీమియర్ అవార్డుకు ఎంపికయ్యి ఉత్తమ రైతు అవార్డు అందుకున్నాడు. 2024లో హైదరాబాద్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సహస్ర కంపెనీ ఉత్తమ రైతు పురస్కారం అందుకున్నాడు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లాలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ హైదరాబాద్ వారి చేతుల మీదుగా పుడమి పుత్ర పురస్కారం అందుకున్నాడు. సతీశ్ తయారు చేస్తున్న సేంద్రియ ఎరువులు, గోశాల, కూరగాయల సాగును బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో పాటు పలువురు ప్రముఖులు సందర్శించారు.

### పుడమితల్లిని కాపాడేందుకు..



నేను 18 ఏళ్లుగా సేంద్రియ ఎరువు తయారుచేస్తూ కూరగాయలు సాగు చేస్తున్నా. 120 ఆవులతో గోశాల ఏర్పాటు చేశా. పశువుల పేడతో పిడకలు కూడా తయారు చేస్తున్నాం. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నా. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి పుడమి తల్లిని కాపాడేందుకు సేంద్రియ ఎరువులు వాడాలి.
– గోనె సతీశ్, రైతు, శివలింగాపూర్, చెన్నూర్

## బాసర ఆలయం కిటకిట

బాసర: బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలో వేచి ఉన్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు అర్చకులతో అక్షరాభ్యాసం చేయించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పడుతుందని ఆలయ అధికారులు వెల్లడించారు. కాగా, ఆలిండియా దేవాదాయ మట్ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు మూసాపేట్ రామరాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జిడ్డు సుభాష్ యాదవ్ ఆయన్ను సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. వీరి వెంట పోతన్న యాదవ్, సాయికుమార్ యాదవ్, కల్యాణ్ యాదవ్ ఉన్నారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

# పక్కా ప్రణాళికతో లక్ష్యసాధన

శ్రీరాంపూర్/భీమారం: పక్కా ప్రణాళికలతో ఉత్పత్తి లక్ష్యాలు సాధించవచ్చని సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ ఓసీపీ, ఇందారం ఓసీపీని ఆదివారం సందర్శించారు. క్వారీలోని వ్యూపాయింట్ నుంచి పని ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇందారం ఓసీపీని సంప్ ఏరియాలో బొగ్గు నిల్వలను ఉత్పత్తికి భంగం కలుగకుండా వీలైనంత త్వరగా ఉత్పత్తి చేసి రవాణా చేయాలని ఆదేశించారు. ఈమేరకు ఇప్పటినుంచే ప్రణాళికలకు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అంతకు ముందు జీఎం కార్యాలయంలో ఏరియా అధికారులతో బొగ్గు ఉత్పత్తి, రవాణా, రక్షణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసీపీలో మాట్లాడుతూ ఓసీపీలో ఓబీ సంస్థలు తమకు నిర్దేశించిన మట్టి వెలికితీత పనులు చేయాలన్నారు. నెలవారీగా లక్ష్యాలను సాధిస్తేనే వార్షిక లక్ష్యాలను చేరకుంటామన్నారు. సీఆర్ఆర్, జీవీఆర్, వారాహి సంస్థలు తమ పని సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. దీనికి కావాల్సిన యంత్రాలను సమకూర్చుకోవాలన్నారు. 2025–26లో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం గని అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి కంపెనీ లక్ష్యాల సాధన కోసం పాటుపడాలన్నారు. రక్షణ పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఉత్పత్తి అయిన బొగ్గును సకాలంలో రవాణా చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్, ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్టు అధికారి నాగరాజు, ఎస్సార్పీ ఓసీపీ పీవోటీ శ్రీనివాస్, సర్వే అధికారి సంపత్, ఇందారం ఓసీపీ మేనేజర్ రవికుమార్, రక్షణ అధికారి సతీశ్, వారాహి కంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్ ఓసీపీలో అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

### చైత్రమాసం పూజలు



మహిళల సంప్రదాయ నృత్యం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో చైత్రి మాసం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లా నలుములల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయంలో సందడి నెలకొంది. చిరుధాన్యాలతో తయారు చేసిన నైవేద్యాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహిళల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

# ఎల్లంపల్లిలో మరింత తగ్గిన నీటిమట్టం

మంచిర్యాలరూరల్(హాజీపూర్):వర్షాలు కురవకపోవడం, ఎగువ ప్రాంతాల నుంచి ఎలాంటి ప్రవాహం లేకపోవడంతో జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట వద్ద నిర్మించిన ఎల్లంపల్లి(శ్రీపాద సాగర్) ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా పడిపోతోంది. ఆదివారం నాటికి ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా 143 మీటర్లుగా ఉంది. 20.175 టీఎంసీల సామర్థ్యానికి గాను 8 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు నుంచి ఔట్ ఫ్లో కింద 574 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇందులో గూడెం ఎత్తిపోతల పథకానికి 145 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 308 క్యూసెక్కులు తరలిస్తుండగా, ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తి 20,192 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు.



తగ్గుతున్న నీటి మట్టంతో ఎల్లంపల్లి జలాశయం

### షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని మోదెల గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వస్తువులు, సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.40 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు కల్లెటి తిరుపతి తెలిపాడు. ఇంట్లో అకస్మాత్తుగా మంటలు రావడంతో కుటుంబీకులు గమనించి మంటలార్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

# రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ఖానాపూర్: పట్టణ శివారులోని అర్బన్ పార్క్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం..పట్టణంలోని నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారి మీదుగా కుమురం భీం చౌరస్తా నుంచి ఖానాపూర్ వైపు కారు వస్తుంది. నేరడిగొండ మండలం తరణమ్ గ్రామానికి చెందిన హన్మాండ్లు, ముత్యం బైక్‌పై ఖానాపూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తూ రాంగ్‌రూట్‌లో ఢీకొంది. వెనుక నుంచి వస్తున్న ప్యాసింజర్ ఆటోపై బైక్ పడడంతో ఆటో పల్టీకొట్టింది. ప్రమాదంలో హన్మాండ్లు, ముత్యం, ఆటోలో ఉన్న ఖానాపూర్‌లోని డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన చిన్నయ్య, రమేశ్, చిన్నక్కలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో మూడు వాహనాలు దెబ్బతిన్నపట్పికి కారులో ఉన్నవారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



పల్టీకొట్టిన బైక్, ఆటో

### నిలిపి ఉన్న ట్రాక్టర్‌లో ..



అగ్ని ప్రమాదానికి గురైన పంచాయతీ ట్రాక్టర్

భీమిని:మండలంలోని వెంకటపూర్ గ్రామపంచాయతీలో వాగు ఒడ్డున నిలిపి ఉన్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ఆదివారం అగ్ని ప్రమాదానికి గురి అయింది. వెంకటపూర్ గ్రామంలో వాగు ఒడ్డున నిలిపి ఉంచిన గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైరింజిన్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చి మంటలు ఆర్పేసింది. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌కు నిప్పు పెట్టినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

# తండ్రి వచ్చేలోపే.. తనువు చాలించింది

- అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య
- అదనపు కట్నం కోసం టార్చర్..
- పలుమార్లు పెద్దల పంచాయితీ
- అయినా తీరు మారకపోవడంతో బలవన్మరణం
- దండేపల్లిలో ఘటన.. కేసు నమోదు

దండేపల్లి: అత్తింటి వారి అదనపు కట్నం వేధింపులు ఓ వివాహితను బలి తీసుకున్నాయి. పెళ్లి జరిగి ఎనిమిదేళ్లయినా.. అత్తింటి వారి అదనపు కట్నం దాహం తీరలేదు. నాలుగేళ్లుగా భర్తతోపాటు అత్త, మామ, బావ, మరిది వేధింపులను తట్టుకుంది. ఆరు నెలల క్రితం ఆడపిల్ల పుట్టడంతో వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినా అత్తింటివారి తీరు మారలేదు. చివరకు సున్నిత మనస్కురాలైన ఆ వివాహిత చావే శరణ్యనుకుంది. ఉరేసుకుని తనువు చాలించింది. దీంతో ఆరేళ్ల బాబు, ఆరు నెలల పాప తల్లిలేనివారయ్యారు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఆదివారం జరిగింది. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నా... ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం.. దండేపల్లికి చెందిన గంగధరి మల్లేశ్‌కు, జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంత్‌రావుపేటకు చెందిన వరలక్ష్మి అలియాస్ మేఘన(38)తో 2017లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.4 లక్షల కట్నం, 4 తులాల బంగారం, ఇతర సామగ్రి ఇచ్చారు. పెళ్లయిన నాలుగేళ్ల వరకు వీరి కాపురం బాగానేసాగింది. కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న భర్త మల్లేశ్‌కు అదనపు కట్నం కావాలన్న ఆశ పుట్టింది. అప్పటి నుంచి భార్యను వేధిస్తున్నాడు. అతనికి తల్లి, తండ్రి లక్ష్మి, నర్సయ్యతోపాటు అన్న, తమ్ముడు తోడయ్యారు. కుటుంబమంతా వేధించడంతో వరలక్ష్మి భరించలేకపోయింది. ఈ విషయం పుట్టింటివారికి చెప్పడంతో ఏడాది క్రితం పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. నచ్చజెప్పి మళ్లీ కాపురానికి పంపించారు.

**ఆరు నెలల క్రితం పాపకు జననం..**

ఈ క్రమంలో వరలక్ష్మి రెండోసారి గర్భం దాల్చింది. ఆరు నెలల క్రితం పాపకు జన్మనిచ్చింది. దీంతో అదనపు కట్నం వేధింపులు మళ్లీ మొదలయ్యాయి. రోజు రోజుకూ వేధింపులు పెరుగుతుండడంతో భరించలేకపోయింది. పది రోజుల క్రితం భీవండిలో ఉండే తన తండ్రి రాజమల్లుకు ఫోన్ చేసి చెప్పింది. తాను యశ్వంత్‌రావ్‌పేటకు వచ్చిన తర్వాత.. దండేపల్లికి వస్తానని, పుట్టింటికి తీసుకువస్తానని నచ్చజెప్పాడు. శనివారం స్వగ్రామానికి వచ్చిన రాజమల్లు ఆదివారం భార్య అమ్మాయితో కలిసి దండేపల్లిలోని కూతురు ఇంటికి వెళ్లాడు. కూతురు కనిపించకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా చీరతో ఉరేసుకుని కనిపించింది. కన్నబిడ్డను విగతజీవిగా చూసిన తల్లిదండ్రులో బోరున విలపించారు. పుట్టింటికి తీసుకుపోతానంటిని కద బిడ్డా.. అంటూ తండ్రి విలపించిన తీరు అందరినీ కన్నీరు పెట్టించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన కూతురు చావుకు కారకులైన అల్లుడు, అతని తల్లిదండ్రులు, అన్న, తమ్ముడిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి రాజమల్లు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

**తల్లి ప్రేమకు దూరమైన చిన్నారులు..**

వరలక్ష్మి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె కుమారుడు శ్రీనాథ్, కూతురు శరణ్య తల్లిప్రేమకు దూరమయ్యారు. తల్లి ఏమైందో కూడా ఆ చిన్నారులకు తెలియడం లేదు. కనీసం ఆ తల్లికి ఆత్మహత్య చేసుకునే ముందు తన పిల్లలైన గుర్తుకు రాలేదా అని పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.



తల్లి ప్రేమకు దూరమైన చిన్నారులు

# విద్యుత్ కంచె తగిలి యువకుడి మృతి



చౌదరి జయేందర్(ఫైల్)

సిర్పూర్(టి): విద్యుత్ కంచె తగలడంతోనే టోంకిని గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందినట్లు కౌటాల సీఐ ముత్యం రమేశ్, సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ స్పష్టం చేశారు. యువకుడి మృతిపై అనేక అనుమానాలు నెలకొన్న నేపథ్యంలో సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిర్పూర్(టి) మండలం టోంకిని గ్రామానికి చెందిన చౌదరి జయేందర్(19) ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. గ్రామ సమీపంలోని తమ సొంత పొలం చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు ప్రమాదవశాత్తు తగిలి మృతి చెందాడు. జయేందర్ తండ్రి చౌదరి చిరంజీవి, పక్క పొలం యజమాని జయరాం పొలం వద్ద మృతదేహాన్ని గుర్తించారు. విద్యుత్తు లైన్ తగిలి మృతి చెందడంతో తమపై కేసు నమోదవుతుందనే భయంతో ఇద్దరు కలిసి మృతదేహాన్ని పక్కనే ఉన్న పెన్‌గంగ నదిలో పడేశారు. ఆ తర్వాత చిరంజీవి సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌లో తన కుమారుడు చౌదరి జయేందర్ ఇంటి నుంచి బయటి వెళ్లి తిరిగి రాలేదని అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ నెల 12న పెన్‌గంగ నదిలో మృతదేహాన్ని కొందరు భక్తులు గుర్తించారు. పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జయేందర్ మృతదేహాన్ని అతడి తండ్రితోపాటు జయరాం నదిలో పడేసినట్లు నిర్ధారించారు. ఈ మేరకు చౌదరి చిరంజీవి, జయరాంపై అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు..

**మంచిర్యాల జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. మందమర్రిలో వృద్ధురాలి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. నెన్నెల మండలం మైలారంలో వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతిచెందారు.**

**రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు**



భూదేవి (ఫైల్)

మందమర్రిరూరల్: పట్టణంలోని యాపల్ ఏరియాలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ టీచర్ మహంకాళి భూదేవి(65) మృతిచెందింది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. ఇల్లందు క్లబ్ సమీపంలో నివసించే భూదేవి సరుకులు కొనేందుకు యాపల్ ఏరియాలోని జాతీయ రహదారి దాటి సరుకులు తీసుకుని తిరిగి రోడ్డు దాటేందుకు వెళ్తోంది. బెల్లంపల్లి వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొనగా భూదేవి అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు మోహన్‌రాజ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కూతురు ఇద్దరు కుమారులు ఉన్నారు.

**విద్యుత్ షాక్‌తో వ్యక్తి..**



శ్రీనివాస్(ఫైల్)

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ధర్మరాజుల శ్రీనివాస్ (44) కరెంట్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం తన ఇంట్లో టేబి రికార్డర్ రిపేర్‌కు రాగా దానిని సాల్డరింగ్ చేసి సవరించే క్రమంలో శ్రీనివాస్ విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాస్‌ను కర్ర సాయంతో పక్కకు జరిపారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని అతన్ని పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. భార్య లావణ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

### నిర్మల్‌లో చైన్‌స్నాచింగ్‌కు యత్నం

నిర్మల్: స్థానిక నటరాజ్‌మిల్(డిగ్రీకాలేజ్) సమీపంలో ఆదివారం రాత్రి ఓ మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్‌కు యత్నించారు. నిర్మల్ నుంచి ప్యాసింజర్ ఆటోలో ఖానాపూర్ వైపు పలువురు మహిళలు వెళ్తున్నారు. నటరాజ్‌మిల్ సమీపంలోని హోటల్ వద్ద టిఫిన్ చేసేందుకు ఆటోలో నుంచి మహిళలు దిగారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు.. ఓ మహిళ మెడలో నుంచి చైన్‌లాగేందుకు యత్నించారు. ఆ మె మెడకు గాయం కావడంతో అక్కడి నుంచి పరారయ్యారు. గమనించిన స్థానికులు వారిని వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

### 15న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలలో ఈనెల 15న సీనియర్ మహిళా ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంసుందరావు ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 10 గంటల లోపు ఆధార్, మూడు పాస్‌ఫోటోలు తీసుకురావాలని సూచించారు.

### కారును ఢీకొట్టిన బైక్

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలో ఆదివారం సాయంత్రం కారును బైక్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటకు చెందిన ముగ్గురు మైనర్ బాలురు ఒకే బైక్‌పై మంచిర్యాల వైపు వస్తున్నారు. మంచిర్యాల నుంచి వచ్చిన కారు హైలైఫ్ రెస్టారెంట్ సమీపంలో యూటర్న్ తీసుకుని తిరిగి మంచిర్యాల వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక మైనర్ బాలుడు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, వారిని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.